# ప్రభుత్వ డిగ్రీ కళాశాల : చేబ్రోలు

NAAC WITH B GRADE

(ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాల)

చేబ్రోలు, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్. ఇండియా.

UGC
University Grants Commission
UGC CARE - Journal
Arts & Humanities
Sl.No. : 35

## భావవీణ ప్రత్యేక సంచిక

Journal of Literary, Culture & Language Studies

Vol. 17 - Issue. 10 - Spl. Edition - October 2020 - ISSN No. : 2456-4702

# ఆధునిక తెలుగు సాహిత్యం - ప్రపంచీకరణ ప్రభావం



## అంతర్జాతీయ అంతర్జాల సదస్సు (వెబినార్)

8 - 9 అక్టోబర్ 2020

నిర్వహణ :

**తెలుగు విభాగం**

ప్రభుత్వ డిగ్రీ కళాశాల,

చేబ్రోలు, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | డాలరు కోడలు నవలలో కుటుంబ సంబంధాలు | - డా॥. వి. శ్రీదేవి | 6 |
| 2. | ప్రపంచీకరణ నేపథ్యంలో రైతు కథలు | - డా॥. టి. జాన్ కిరణ్‌బాబు | 13 |
| 3. | ప్రపంచీకరణ నేపథ్యంలో సాంస్కృతిక పరిణామం | - డా॥. పి.ఎ. సత్యనారాయణ & - ఎ. మనోజ్ కుమార్ | 18 |
| 4. | ఆధునిక సాహిత్యంలో-జానపద సాహిత్యం -ప్రపంచీకరణ ప్రభావం | - డా॥. ఏ. నాగజ్యోతి | 21 |
| 5. | "వ్యాపారమృగం" కథల సంపుటి - ప్రపంచీకరణ | - రవిందర్ అచ్చ | 26 |
| 6. | ఆధునిక తెలుగు కథ - ప్రపంచీకరణ | - డా॥. రాచపాళెం పురంధీశ్వరి | 32 |
| 7. | బతుకమ్మ పండుగ సంస్కృతి - నేపథ్యం - మొగ్గల కవిత ప్రక్రియ | - బసవరాజప్ప | 36 |
| 8. | ఆధునిక తెలుగు నాటకం - ప్రపంచీకరణ ప్రభావం | - పేరం శాంతి | 40 |
| 9. | 'రక్తస్పర్శ' కవుల కవిత్వం - ప్రపంచీకరణ ప్రభావం | - భూక్యా కాశీరామ్ | 44 |
| 10. | ఆధునిక కవిత్వం - ప్రపంచీకరణ ప్రభావం | - డా॥. యల్. నాగలక్ష్మి దేవి | 48 |
| 11. | తెలుగు కవిత - ప్రపంచీకరణ ప్రభావం | - ఎలగొండ రాములు | 51 |
| 12. | స్త్రీ - నాటి నుండి నేటి వరకు ఒక అవలోకనం | - సోనబోయిన సతీష్ | 55 |
| 13. | తెలుగు కథలలో, కుటుంబ వ్యవస్థపై ప్రపంచీకరణ ప్రభావం | - సూరేపల్లి పద్మావతి | 59 |
| 14. | ప్రపంచీకరణ - పల్లె జీవితం | - డా॥. ఏ. వెంకటప్రసాదు | 63 |
| 15. | ప్రపంచీకరణ - తెలుగు భాష | - డా॥. సి. నర్సింహులు | 66 |
| 16. | కథా నేపథ్యంగా తెలుగుభాష-సంస్కృతి-ప్రపంచీకరణ ప్రభావం | - డా॥. వి. శాంతిలక్ష్మి | 68 |
| 17. | మునికన్నడి సేద్యం - రైతు వ్యవసాయ కుటుంబ జీవిత చిత్రణ | - మార్తల పవన్ కుమార్ రెడ్డి | 71 |
| 18. | ప్రపంచీకరణ నేపథ్యంలో రజక వృత్తి | - అరసవిల్లి మోహనరావు | 74 |
| 19. | ప్రపంచీకరణ - పల్లెజీవనం | - కాపర్తి స్వరాజ్యం | 77 |
| 20. | వ్యవసాయంరంగంపై ప్రపంచీకరణ ప్రభావం - కథా సాహిత్యం | - డా॥. కె. రమేశ్ | 82 |
| 21. | చైతన్య దీపికలు కథల సందేశం - ప్రపంచీకరణ ప్రభావం | - శశికళ. యస్ | 88 |
| 22. | రైతు, పల్లె జీవనంపై ప్రపంచీకరణ ప్రభావం | - సారంగపాణి బండి | 93 |
| 23. | తెలుగు కథలలో ప్రపంచీకరణ ప్రభావం - నగర జీవితం | - డా॥. ఎం. ప్రభావతి | 97 |
| 24. | ప్రపంచీకరణ కవిత్వం - రైతు జీవితం | - వి. పవన్ కుమార్ రెడ్డి | 102 |
| 25. | 'కవితా వార్షిక 2004' - ప్రపంచీకరణ భావాలు - పరిశీలన | - డా॥. కె.రత్నశేఖర్ | 105 |
| 26. | ప్రపంచీకరణ ప్రభావం - చేనేత వృత్తి సాహిత్యం పరిశీలన | - గడ్డం నాగేందర్ | 110 |
| 27. | మల్లిపురం జగదీశ్ కథలు - ప్రపంచీకరణ సాంస్కృతిక విధ్వంసం | - ఎం. రమాగీతాదేవి | 116 |

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

# ప్రపంచీకరణ - తెలుగు భాష

– డా॥. సి. నర్సింహులు, సహాయ ఆచార్యులు, యం.వి.యస్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వ), మహబూబునగరు.

ప్రపంచంలో ఏభాషకైనా జాతి లేనిది భాషలేదు. భాషలేనిది సాహిత్యం లేదు. వాఙ్మయము, భాష, సాహిత్యము పర్యాయపదాలుగా వ్యవహారములో ఉన్నప్పటికి వాటి అర్థాలకు తేడా వుంది. పుట్టిన ప్రతి ప్రాణి చేసే శబ్దం వాఙ్మయము. భావాత్మకైన ధ్వని భాష. లిఖిత రూపమైన వాఙ్మయ భాష సాహిత్యము. ఇందులో సాహిత్యము కన్న భాష ప్రాచీనము. భాషకన్న జాతి ప్రాచీనము. ఆ జాతి పలుకు వాఙ్మయము అతి ప్రాచీనము. భారతదేశములో ప్రాకృత, సంస్కృత ద్రవిడ భాషలతో పాటు తెలుగుకూడ ప్రాచీనభాషయే. క్రీ.పూ. 3వ శతాబ్దంలోనే దక్షిణ భారతదేశాన్ని పాలించిన శాతవాహనుల కాలంలోనే "తెలుగు" రాజభాషగా గాక ప్రజాభాషగానే వుంది. ఇలా జాతిపరంగా, భాషాపరంగా, సాహిత్యపరంగా తెలుగుభాషకు చాలా ప్రాచీనత వుంది. శాతవాహనుల కాలంలో ప్రతిష్ఠానపురంనుండి అమరావతి వరకు, అనగా తూర్పు, పడమర సముద్రాలవరకు, కాకతీయులకాలంలో కాంచీపురంనుండి మధురవరకు, విజయనగరరాజుల పాలనా కాలంలో బళ్ళారి నుండి బరంపురం వరకు, దక్షిణాన కన్యాకుమారి వరకు రాజభాషగా వెలుగొందినది మన తెలుగుభాష. ఇప్పటికి తంజావూరు సరస్వతి మహలునందు తెలుగుసాహిత్యమే అధిక సంఖ్యలో వుంది.

మన తెలుగు సాహిత్యముపై శాతవాహనుల కాలంనుండి బహుమని సుల్తానుల వరకు తెలుగు భాషపై ఎవరి ప్రభావము లేదు. గోలకొండ కుతుబ్షాహీల కాలంలో పర్షియా రాజభాషగా వున్నప్పటికి తెలుగు భాషకు ఎటువంటి నష్టం జరుగలేదు. తర్వాతి కాలంలో నిజాం నవాబుల రాజభాష ఉర్దూ అయినప్పటికి తెలుగు భాషను ప్రోత్సహించారు. ఆంగ్లేయుడైన సి.పి.బ్రౌను దొరగారు తెలుగు భాషకు ఎనలేని సేవచేశారు. తెలుగుప్రాంతాన్ని అనేక భాషల రాజులు పాలించినప్పటికి తెలుగుభాష వెలిగిపోయింది కాని తొలగిపోలేదు.

ప్రపంచీకరణ ప్రభావము వల్ల ఈనాడు అంతరించి పోతున్న భాషలలో తెలుగు ఒకటని అంతర్జాతీయ సంస్థ యునెస్కో ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా వ్యవహారంలోని ఆరువేల భాషల్లో ఇప్పటికే మూడువేల భాషలు అంతరించి పోయాయని అందులో తెలుగు ఒకటని ఈ సంస్థ వెల్లడించింది. అది కొంతవరకు నిజమే. నేటితరం పిల్లలకు ప్రపంచజ్ఞానం పేరుతో ఆంగ్లంపై వ్యామోహంతో తల్లిదండ్రులు తెలుగును దూరం చేస్తున్నారు. తెలుగు భాషను నాశనం చేసేది తెలుగువారె కాని మరెవరో కాదు. తెలుగువారు తెలుగును మాట్లాడటమే చిన్న చూపుగా భావిస్తున్నారు. దీనికి కారణం ఎవరంటే ప్రభుత్వము, ప్రజలు అందరూ కారకులే. ప్రభుత్వం ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులో నిర్వహిస్తే భాషగొప్పదనం తెలుస్తుంది. తప్పకుండా ప్రతివ్యక్తి భాషను నేర్చుకుంటాడు. కాబట్టి భాష అంతరించిపోవడానికి ప్రథమకారకులు పాలకులే. భాషాదినోత్సవాలు జరుపుకోవడమే భాషాంతానికి మూలమని నా భావన.

మన ప్రాచీనులు ప్రాపంచిక విషయాలు తెలుసుకోవాలన్నారు. దానిద్వారా మన ఉనికికి ప్రమాదం రాకూడదు. ప్రాపంచిక భావనవేరు ప్రపంచీకరణ వేరు. "తెలుగుభాషలో లేని పదాలను అన్యభాషలనుండి స్వీకరించడము ప్రాపంచిక భావన అయితే భాషలో వున్న పదాలకు మారుగా అన్యభాషా పదాలను స్వీకరించి తెలుగుభాషా పదాలను లేకుండా చేయడము ప్రపంచీకరణ". అట్లే తెలుగు సాంస్కృతిక సాంప్రదాయాలు ప్రపంచీకరణ వల్ల నాశనం కారాదు. ప్రాపంచిక భావనవల్ల

ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

అవి విశ్వవ్యాప్తం కావాలి. మనపూర్వులు కావ్యరచన కూడ విశ్వశ్రేయం అన్నారు కాని "విశ్వనాశనం" అని అనలేదు. ఆ విషయాన్ని గుర్తెరిగి మనం నడచుకోవాలి. లేకపోతే మన ఉనికికే ప్రమాదం.

ఆంగ్లభాష మీద వ్యామోహంతో తెలుగుకు దూరమైన వారిని గూర్చి కవి కాళోజీ నారాయణరావు గారు చెప్పిన మాటలు

**ఏ భాషనీది ఏమివేషమురా**
**ఈ భాష యీ వేషమెవరికోసమురా**
**ఆంగ్లమందున మాటలనగనే**
**ఇంతగుల్కెదవు ఎందుకోసరమురా**
**తెల్గు బిడ్డవయ్యి తెల్గురాదంచును**
**సిగ్గులేక యింక జెప్పుటెందుకురా**
**"అన్యభాషలు నేర్చి ఆంధ్రంబు రాదంచు**
**సకిలించు ఆంధ్రుడా చావవెందుకురా"**

ప్రస్తుతము మన తెలుగువారు ఆంగ్లం మీద మోజుతో భాషనే గాక సంస్కృతి, సంప్రదాయాలు కూడ మరచిపోతున్నారు. కాని విదేశాలలో వున్న తెలుగువారు, భాషను, సంస్కృతిక రంగాన్ని మరచిపోకుండా కాపాడు తున్నారు. అందుకే "పొరుగింటి వారి పుల్లకూర రుచి" వంటి సామెతలు పుట్టినవి. ఏ ప్రాంతంలో వుంటే అది బాగుండదు. ఆ ప్రాంతానికి దూరమైతేనే తన ప్రాంతం మీద మమకారం పుడుతుంది. దాని విలువ తెలుస్తుంది. ఏది ఏమైనా ప్రస్తుతము మన జాతికి, భాషకు వచ్చిన ప్రమాదమేమి లేదని నా అభిప్రాయం. పండాకు పడి పోతుంది పసురాకు వస్తుంది. పాతనీరు పోతుంది. కొత్తనీరు వస్తుంది. భాష మార్పుకు గురవుతుంది. కాని నశించదు.

తెలుగుభాష పుట్టినప్పటి నుండి ఎన్నో ఆటుపోటు లెదుర్కొన్నది. అనేక భాషల సంపర్కము చూసింది. వేరే భాషకు తన రుచిని చూపించింది. వేరే భాషల పదాలను తనలో కలుపుకున్నది. ప్రాకృత, సంస్కృత, పాళీ వంటి భారతీయ భాషలే గాక రోమను, గ్రీకు, ఇటలీ, ఆంగ్ల భాషలు తెలుగులో ఒదిగిపోయినవి. కొన్ని భాషలలో యితర భాషాపదాలు ఇమడవు. అన్యభాషా పదాలను యిముడ్చుకోగల సామర్థ్యం తెలుగుభాషకు వుంది. తెలుగుభాష ప్రాచీనమైనదే కాదు, చాలా శక్తివంతమైనది, మధురమైనది. భారతీయ భాషలన్నింటికన్నా ప్రత్యేకమైన అజంతభాష తెలుగు. ప్రపంచంలోనే అజంతభాషలు రెండే రెండు. ఒకటి "ఇటలీ భాష" రెండవది "తెలుగు భాష". కాబట్టే తెలుగు భాషను "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" అన్నారు. మహోన్నతమైన తెలుగుభాష ప్రపంచీకరణ వల్ల మరుగున పడిపోతుందుకోవడం జరుగదని నా అభి ప్రాయం. ఒక భాష తనలో ఇతరభాషా పదాలను కలుపు కొని పోకుంటే అది మృతభాష. మన తెలుగు ఇతరభాషా పదాలను సులభంగా తనలో కలుపుకొని పోతుంది. కాబట్టి తెలుగుకు ఆగతి పట్టదు. కొంతమంది ఆంగ్లభాషమీద మోజుతో భాషను చిన్న చూపు చూసినప్పటికి, మన తెలుగుభాష మృతభాషకాదు. జీవన్భాష, అమృతభాష.

## ఆధార గ్రంథాలు :


1. ఆంధ్రుల సాంఘికచరిత్ర - సురవరం ప్రతాపరెడ్డి.
2. నాగొడవ - కాళోజీ నారాయణరావు.
3. మహబూబునగరు జిల్లా సర్వస్వము - బి.యన్.శాస్త్రి.


❖ ❖ ❖